

దేశ సరిహద్దుల్లో..



మా కుమారుడు దేశ రక్షణలో భాగస్వామి కావడం ఆనందంగా ఉంది. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో దేశ రక్షణకై పోరాడడం మామూలు విషయం కాదు.. ప్రాణాలెదురొడ్డి పోరాడాలి. మనం ఇక్కడ భయపడితే వారు అక్కడ భయపడతారు. అలా కాదు.. మనం ధైర్యంగా ఉండాలి.. వారిలో ధైర్యాన్ని నింపాలి.. ఇదీ అల్లవరం మండలం ఈటీవారి గ్రామానికి చెందిన యాటి చిన శివకుమార్ తల్లిదండ్రులు గోపాలరావు, కాశీరామేశ్వరి స్పందన. మా రెండో అబ్బాయి యాటి చినశివకుమార్ 20 ఏళ్లుగా ఆర్మీ ఎయిడ్ డిఫెన్స్ విభాగంలో విధుల్లో ఉంటున్నాడు. ప్రస్తుతం భారత్-పాకిస్తాన్ దేశాల మధ్య యుద్ధం నెలకొన్న నేపథ్యంలో చిన శివకుమార్ జమ్మూ బోర్డర్ సమీపాన ఉద్దంపూర్‌లో సైనిక విధుల్లో ఉన్నాడని వారు తెలిపారు. కుటుంబ పరంగా ఆందోళన కలిగిస్తున్నా, దేశం తరఫున పోరాడుతున్నందుకు గర్వంగా ఉందని తెలిపారు.



పవన్.. పెద్ద మనసు

- తన జీతం.. వారి జీవితాలకు..
- 42 మంది పిల్లలకు నెలకు రూ.5 వేల చొప్పున పంపిణీ
- ఆ వృద్ధురాలితో కలసి భోజనం

నాకు దాచుకోవడం తెలియదు.. పంచిపెట్టడం తప్ప.. ఎన్నికలకు ముందు ఒక బహిరంగ సభలో పవన్ చెప్పిన మాట ఇది.. నిజమే ఆయనకు దాచుకోవడం తెలియదు.. అందుకే పేదలను చూస్తే కరిగిపోతారు.. పవర్ స్టార్ పవన్‌కల్యాణ్ ఇప్పుడు మరో మంచి పనికి శ్రీకారం చుట్టారు. డిప్యూటీ సీఎం పదవి ద్వారా ప్రతి నెలా వచ్చే జీతం మొత్తం పిఠాపురం నియోజకవర్గంలో తల్లిదండ్రులు లేని 42 మంది చిన్నారులకు రూ.5 వేలు చొప్పున పంపిణీ చేయాలని తలంచారు.. దీనిలో భాగంగా శుక్రవారం చిన్నారులను మంగళగిరి రప్పించుకుని రూ.5 వేల చొప్పున అందజేశారు.. వచ్చే నెల నుంచి ఇంటి వద్దే పంపిణీ చేస్తారని ప్రకటించారు.. తనపై అభిమానం పెంచుకున్న ఒక 95 ఏళ్ల వృద్ధురాలిని ఇంటికి తీసుకెళ్లారు.. నీకేం కావాలవ్వా అని అడిగారు. నీతో భోజనం చేయాలని ఉంది బాబూ అనగానే ఆమెతో కలిసి భోజనం చేశారు.. చీర పెట్టి, రూ.లక్ష ఇచ్చి కారులో ఇంటికి పంపారు.. - మెయిన్‌లో

హై..అలర్ట్!

భద్రత.. కట్టుదిట్టం





భారత్ - పాకిస్తాన్ యుద్ధ వాతావరణం నేపథ్యంలో రోజురోజుకు పరిణామాలు మారుతున్నాయి. దేశవ్యాప్తంగా సముద్ర తీర ప్రాంతాల్లో ప్రభుత్వం హై అలర్ట్ ప్రకటించింది. పోర్టులు, నౌకాశ్రయాల్లో భద్రత పెంచింది. సముద్ర జలాల ద్వారా ముష్కరులు వచ్చే అవకాశం ఉందన్న హెచ్చరికలతో తీర ప్రాంతాల్లో భద్రతను రెండంచెల స్థాయికి పెంచారు. జిల్లా పోలీసులు, కోస్టు గార్డ్ సిబ్బంది, కస్టమ్స్, పోర్టు అధికారులు అప్రమత్తమై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. డ్రోన్లతో నిరంతరం నిఘాను పెంచుతూ తీరంలోని కదలికలను పరిశీలిస్తున్నారు. షిప్‌యార్డులు, సీ పోర్టుల్లో ఉన్న విదేశీ నౌకలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. మరోవైపు మధురపూడి విమానాశ్రయం, రైల్వే స్టేషన్ల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు.



- తీరాన ముమ్మర గస్తీ
- కోస్ట్‌గార్డ్, మెరైన్ బృందాల తనిఖీ
- చమురు నిక్షేపాలకు ప్రత్యేక రక్షణ
- విమానాశ్రయంలో రెడ్ అలర్ట్
- 800 ఏపీఎస్‌పీఎఫ్ సిబ్బంది
- 3 రోజులుగా సాగుతున్న మాక్‌డ్రిల్

ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో దేశ సంపదలో కీలకంగా ఉండే కృష్ణా గోదావరి బేసిన్ పరిధిలోని చమురు, సహజ వాయువు క్షేత్రాల వద్ద హైఅలర్ట్ ప్రకటించారు. తీర ప్రాంతం వెంబడి ఉన్న అపార చమురు నిక్షేపాలు కలిగిన ప్లాంట్ల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. శాటిలైట్ ద్వారా నిఘా పెంచారు. సముద్రం వెంబడి కోస్టుగార్డు, మెరైన్ పోలీసుల గస్తీ నౌకలు పర్యవేక్షిస్తున్నాయి. గత మూడు రోజులుగా కోనసీమలోని సముద్ర తీరం వెంబడి ఉన్న చమురు, గ్యాస్ నిక్షేపాల కేంద్రాల వద్ద సీఐఎస్ఎఫ్, పోలీసు, అగ్నిమాపక సిబ్బంది మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్నారు. అనివార్య పరిస్థితుల్లో సైరన్ వినిపిస్తే ప్రజలు ఎలా స్పందించాలి అనే దానిపై కూడా వారు స్థానికులకు అవగాహన కల్పిస్తున్నారు. రహదారులపై అర్ధరాత్రుళ్లు తనిఖీలు చేస్తున్నారు. అనుమానితులను ప్రశ్నిస్తున్నారు. ఎక్కడి నుంచి వస్తున్నారు? ఎక్కడికి వెళుతున్నారు? వంటి విషయాలపై ఆరా తీస్తున్నారు. మొత్తంగా కోస్తా తీరంలో బలగాలన్నీ అప్రమత్తమయ్యాయి.

- (అమలాపురం/ కాకినాడ/ రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)



ఎస్.యానాంలో వేదాంత ప్లాంట్ వద్ద స్థానికులకు అవగాహన కల్పిస్తున్న సీఐ ప్రశాంతకుమార్

తీరాన నిఘా...

కోనసీమ జిల్లా పరిధిలోని అంతర్వేది నుంచి ఐ.పోలవరం మండలం హోప్‌ఐలాండ్ వరకు ఉన్న సముద్ర తీరం వెంబడి అపార చమురు, సహజ వాయువుల నిక్షేప కేంద్రాలు ఉన్నాయి. సముద్రపు లోతు జలాల్లో బావుల ద్వారా ఉత్పత్తి అయ్యే గ్యాస్, ఆయిల్‌ను ప్లాంట్ల ద్వారా శుద్ధిచేసి విశాఖ లేదా ఇతర రాష్ట్రాలకు తరలించడం ద్వారా వేల కోట్ల ఆదాయాన్ని ఆ సంస్థలు ఆర్జిస్తున్నాయి. జిల్లా పరిధిలోని రిలయన్స్, జీఎస్‌పీఎస్, ఎస్.యానాంలోని వేదాంత, ఓడలరేవులోని ఓఎన్జీసీ ప్లాంటు, కేశనపల్లి, కరవాక ప్రాంతాల్లో ఉన్న ప్లాంట్లతో పాటు అత్యంత కీలకంగా ఉండే నగరంలోని జీసీఎస్‌లతో పాటు కోనసీమవ్యాప్తంగా 30కు పైగా ప్రాంతాల్లో చమురు, సహజవాయువుల అన్వేషణ కేంద్రాలు ఉన్నాయి. సీఎస్ఎఫ్, అగ్నిమాపక, పోలీస్‌తో పాటు స్థానికంగా ఉండే వివిధ శాఖల అధికారుల పర్యవేక్షణలో మాక్‌డ్రిల్ నిర్వహిస్తూ ఆయా ప్రాంతాల్లోని ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నారు. అగ్ని ప్రమాదాలు, పేలుళ్లు, అనుమానాస్పద వస్తువులు కనిపించినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాంలో రూరల్ సీఐ ప్రశాంత్‌కుమార్, మెరైన్ పోలీసులు, వేదాంత సిబ్బంది స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాంట్ల పరిసరాల్లో ప్రజల కదలికలపై నిఘా ఉంచాల్సిందిగా సూచించారు. చమురు క్షేత్రాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయా కంపెనీలకు చెందిన ప్రతినిధులతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు సమీక్ష నిర్వహించి సూచనలు చేశారు. సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, ఇతర వ్యక్తుల సంచారంపై నిఘా ఉంచాలని, సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు, వారి కదలికలపై కూడా నిఘాను పటిష్టం చేయాల్సిందిగా సూచించారు. సముద్రపులోతు జలాల్లో ఉన్న వివిధ సంస్థలకు చెందిన ఆఫ్‌షోర్ ప్లాట్‌ఫారాల వద్దకు నౌకలు, భారీ బోట్‌లు వంటివి ప్రయాణించకుండా కోస్ట్‌గార్డు బృందాలు నిఘా ఉంచాయి. రిలయన్స్, గుజరాత్ పెట్రోలియం, ఓఎన్జీసీ సంస్థలతోపాటు ఇతర ప్రైవేటు సంస్థలకు చెందిన ప్లాట్‌ఫారాల ద్వారా చమురు, సహజవాయువుల అన్వేషణ జరుగుతోంది. మరో వైపు కాకినాడ యాంకరేజ్, డీప్‌వాటర్ పోర్టులో భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేశారు. కేసీపీఎల్‌లో కూడా వచ్చే, వెళ్లే షిప్‌లను పరిశీలిస్తున్నారు. సముద్రంలో కేజీ బేసిన్ చమురు క్షేత్రాలు సమీపంలోకి ఎవరూ రాకుండా ముమ్మర గస్తీ నిర్వహిస్తున్నారు. సీకోస్టల్‌లో ఎక్కువగా కర్మాగారాలు, ఆయిల్ రిఫైనరీలు అధికంగా ఉన్న నేపథ్యంలో స్థానిక సెక్యూరిటీ విభాగాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు తీర ప్రాంతంలో పెట్రోలియం స్టోరేజ్ కేంద్రాలు, కర్మాగారాల్లో భద్రతా సిబ్బందిని జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తం చేసింది. ఐవోసీఎల్, బీపీసీఎల్,హెచ్‌పీసీఎల్ వంటి పెట్రోలియం స్టోరేజ్ కేంద్రాలు, కార్మాగారాల్లో ఇతరులను అనుమతించొద్దని భద్రత సిబ్బందికి హెచ్చరికలు జారీచేశారు. అలాగే బాంబ్ స్క్వాడ్స్, డ్రోన్ బృందాలు, కోస్ట్ గార్డ్స్, కేఎస్‌పీఎల్ సెక్యూరిటీ సిబ్బందికి సూచించారు.

విమానాశ్రయంలో అణువణువు తనిఖీలు..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలతో ఆంధ్ర ప్రదేశ్ ప్రత్యేక రక్షక దళం(ఏపీఎస్‌పీఎఫ్) అప్రమత్తమైంది.కమాండెంట్ కేఎస్ రావు స్వీయ పర్యవేక్షణలో భద్రత కట్టుదిట్టం చేశారు. ఉమ్మడి తూర్పు గోదావరిలోని అన్నవరం దేవస్థానం, కాకినాడ రిలయన్స్‌ఓఎన్‌జీసీ రిగ్‌లు, యాంకరేజీ పోర్టు, రాజమండ్రి ఓఎన్‌జీసీ బేస్ పరిధిలోని కోనసీమ జిల్లాలోని కృష్ణా-గోదావరి బేసిన్ బావులు, రాజమహేంద్రవరం విమానాశ్రయం, బ్యాంకు చెస్ట్‌లకు ఏపీ ఎస్‌పీఎఫ్ సుమారు 800 మంది సుశిక్షితులైన పోలీసులతో భద్రత కల్పిస్తోంది. కోనసీమలోని గ్యాస్ పైపులైన్లను నిరంతరంగా పహారా కాస్తున్నారు. రాజమండ్రి ఎయిర్ పోర్టులో రెండంచెల భద్రత ఏర్పాటు చేశారు. వీవీఐపీ, వీఐపీ వంటి హోదాలతో సంబంధం లేకుండా ప్రయాణికులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. అన్నిచోట్లా నిఘా ముమ్మరం చేశారు. మెటల్, లగేజీ డిటెక్టర్లను ఏర్పాటు చేశారు. సందర్శకులను ఇప్పటికే నిషేధించారు. రాజమండ్రి రైల్వే స్టేషన్‌లో స్వీయ రక్షణపై మాక్ డ్రిల్ నిర్వహించారు. రైల్వే రక్షణ దళం (ఆర్పీఎఫ్), ప్రభుత్వ రైల్వే పోలీసులు (జీఆర్పీ), సిబ్బంది ఎప్పుడైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే ఎలా స్పందించాలనే దానిపై అవగాహన కల్పించారు.



కాకినాడలోని పెట్రోలియం స్టోరేజ్ కేంద్రాలు, కర్మాగారాల్లో భద్రత సిబ్బందిని అప్రమత్తం చేస్తున్న పోలీసులు

మేం సిద్ధంగా ఉన్నాం..



ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి ఆయుధ సంపత్తితో సిద్ధంగా ఉన్నాం. పర్యవేక్షణ అధికారులు నిరంతరం విధుల్లోనే ఉంటున్నారు. సిబ్బందికి తరచుగా ఆయా ప్రదేశాల భద్రత, ప్రజల రక్షణపై సూచనలు చేస్తున్నాం. యుద్ధం మన వరకూ వచ్చినా ప్రాణాలొడ్డి పోరాడతాం.

- కేఎస్ రావు, కమాండెంట్, ఏపీఎస్‌పీఎఫ్



సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ కంట్రోలర్ సలీం

వ్యాపారులు మోసాలకు పాల్పడితే ఫిర్యాదు చేయండి

అసిస్టెంట్ కంట్రోలర్ సలీం

కార్పొరేషన్(కాకినాడ), మే 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కడైనా వ్యాపారులు మోసాలకు పాల్పడితే తూనికలు కొలతలశాఖ (లీగల్ మెట్రాలజీ)కు ఫిర్యాదు చేయాలని అసిస్టెంట్ కంట్రోలర్ ఎస్కే సలీం అన్నారు. శుక్రవారం కాకినాడలోని వెండి, బంగారం వర్తక సంఘం కల్యాణ మండపంలో లీగల్ మెట్రాలజీ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ మెట్రాలజీ దినోత్సవం, వినియోగదారుల హక్కుల గురించి వర్తక సంఘాలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మోసాలను నియంత్రించేందుకు లీగల్ మెట్రాలజీశాఖ కృషి చేస్తోందన్నారు. లీగల్ మెట్రాలజీ శాఖ జాయింట్ కంట్రోలర్ పి.సుధాకర్ మాట్లాడుతూ వినియోగదారులకు కచ్చితమైన తూకం, వ్యాపార సంస్థల్లో ఉపయోగించే కాటాలు, వాటి ముద్రణ వంటి అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని చెప్పారు. బరువు, పొడవులకు సంబంధించి నాణ్యత లోపాలు, మోసాలను నియంత్రించేందుకు లీగల్ మెట్రాలజీ (తూనికలు కొలతలు) శాఖ కృషి చేస్తోందని తెలిపారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కంట్రోలర్ సయ్యద్ సలీం, ఇన్‌స్పెక్టర్ పి.సరోజిని, ఇన్‌స్పెక్టర్ మోహన్, ఇన్‌స్పెక్టర్ నాగేంద్ర కుమార్, వినియోగదారుల రక్షణ సమాఖ్య జాయింట్ సెక్రటరీ డీసిపిసి మెంబర్ కొమ్మూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లకు
అరుంధతి నక్షత్ర దర్శనం 7

ఉపాధికి..బీమా

- బడుగులకు ప్రభుత్వం భరోసా..
- ఉపాధి కార్మికులకు ఆర్థిక ఊతం
- బీమా రూ.2 లక్షలకు పెంపు

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

ఉపాధికి ఊతమిచ్చింది.. రెక్కల కష్టంతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్న బడుగుజీవులకు కూటమి ప్రభుత్వం భరోసాగా నిలిచింది. పేదలకు ఆర్థికంగా ఊతమిద్దామనే ఆలోచనతో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మేడే కార్మిక దినోత్సవం సందర్భంగా ప్రమాద బీమా పరిహారం మరింత పెంచుతామని చేసిన ప్రకటన ఉపాధి శ్రామికులకు భద్రతగా మారనుంది. కాకినాడ జిల్లా 21 మండలాల్లో 385 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో మొత్తం 2,88,267 జాబ్‌కార్డులు ఉన్నాయి. ప్రస్తుతం పని ప్రదేశంలో శ్రామికుడు మృతిచెందినా.. గాయపడి తీవ్ర అంగవైకల్యంతో బాధపడుతున్నా ప్రభుత్వం నుంచి రూ.50 వేలు మాత్రమే సాయం చేస్తున్నారు. ఈ పరిహారం పెంచాలని పలు మార్లు అడిగినా ఎవరూ వినిపించుకోలేదు. అయితే డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఈ పరిహారాన్ని రూ.2 లక్షలకు పెంచుతామని ప్రకటించడంతో వారంతా హర్షంవ్యక్తంచేస్తున్నారు.

పీఎంఎస్‌బీవై..

ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన(పీఎంఎస్‌బీవై) 18 నుంచి 70 ఏళ్ల వారు అర్హులు..ఈ పథకంలో 3,35,218 మంది సన్న, చిన్న కారు రైతులకు అర్హత ఉంది. ఒక్కో వ్యక్తి రూ.20 నగదు చెల్లించాలి. ప్రమాదంలో మృతి చెందితే రూ.రెండు లక్షల బీమా అందించి బాధిత కుటుంబాన్ని ఆదుకుంటారు. ఇప్పటి వరకు 2,98000 రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు.

పీఎంజేజేబీవై

ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై)లో మేలు చేకూర్చనున్నారు. ఉపాధి శ్రామికుల వయస్సు 18-50 ఏళ్ల లోపు ఉన్న వారు అర్హులు. జిల్లా వ్యాప్తంగా చూస్తే 2.15 లక్షల మందికి మేలు చేసేలా కార్యచరణ ప్రణాళిక రూపొందించారు. ఒకొక్క వ్యక్తి రూ.436 ప్రీమియం చెల్లించాలి. ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2 లక్షల సాయం అందజేస్తారు. సాధారణ మరణమైతే రూ.లక్ష వరకు ఇస్తారు. జిల్లా వ్యాప్తంగా1,31,349 మంది పేర్లు నమోదు చేసుకున్నారు. మిగతా వారిని కూడా భాగస్వాములను చేయాలని అధికారులు ఆదేశించారు. తాజా నిర్ణయం పేదలకు మేలు చేస్తుందని డ్వామా పీడీ వెంకటలక్ష్మి తెలిపారు.



కాకినాడ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

రోడ్డెక్కిన ఉపాధ్యాయులు

- డిమాండ్ల సాధనకు ధర్నా
- కలెక్టరేట్ ఎదుట నిరసన

కలెక్టరేట్(కాకినాడ), మే 9 (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్(ఏపీటీఎఫ్) ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు కాకినాడ కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా చేశారు. ఏపీటీఎఫ్ కాకినాడ జిల్లా శాఖ అధ్యక్షుడు ఫిలిప్‌రాజు, ప్రధానకార్యదర్శి నల్లబిల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఒకటి నుంచి ఐదో తరగతులను బేసిక్ ప్రాథమిక పాఠశాలలో కొనసాగించాలన్నారు. ప్రాథమిక పాఠశాలకు పూర్వ ప్రాథమిక విద్యను అనుసంధానించాలన్నారు. సీపీఎస్ విధానం, జీపీఎస్ విధానాలను రద్దుచేయాలన్నారు. 12వ పీఆర్సీ కమిషన్ వెంటనే నియమించి మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు.11వ పీఆర్సీ బకాయిలతో పాటు ఉద్యోగులకు రాష్ట్రప్రభుత్వం ఇచ్చే అన్ని బకాయిలను చెల్లించాలన్నారు.స్టేట్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్ ప్రకారం రాష్ట్రంలో ఏకరీతిలో పదోన్నతుల కోసం సీనియార్టి జాబితాను రూపొందించాలన్నారు. విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతి ఉన్నత పాఠశాలకు హెచ్ఎం, పీడీ పోస్టులను మంజూరు చేయాలన్నారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావుకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు దుర్గాప్రసాద్, నాయకులు కేఎస్ సుబ్రహ్మణ్యం,శ్రీరామ్, సత్యప్రసాద్, బి.శ్రీనివాస్, ఏసుబాబు, అప్పారావు పాల్గొన్నారు.



గొల్లప్రోలులో రికార్డులు తనిఖీ

పురపాలికల్లో ఆడిట్ పూర్తి

ఆడిట్ అధికారి సురేష్‌బాబు

పిఠాపురం, మే 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ కార్పొరేషన్, పిఠాపురం, సామర్లకోట, పెద్దాపురం,తుని పురపాలక సంఘాలు, గొల్లప్రోలు, ఏలేశ్వరం నగరపంచాయతీల్లో ఆడిట్ పూర్తయిందని జిల్లా ఆడిట్ అధికారి వై.సురేష్‌బాబు తెలిపారు. ప్రాథమిక రిపోర్టులను సిద్ధం చేసి సమీక్షలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గొల్లప్రోలు నగర పంచాయతీ ఆడిట్ రిపోర్టులను శుక్రవారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 385 గ్రామ పంచాయతీలు, 20 మండల పరిషత్‌లు,9 మార్కెట్ కమిటీలు, 144 దేవాలయాలు, సత్రాల ఆడిట్ పూర్తిచేసి నివేదికలను సంబంధిత ఎగ్జిక్యూటివ్ అథారిటీలకు పంపామన్నారు. జిల్లా మొత్తం ఆడిట్ నివేదికను ఒక నెలలో సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు. ఆయన వెంట అసిస్టెంట్ ఆడిటర్ రమణారావు, సీనియర్ ఆడిటర్లు ఉన్నారు.

ఆదాయం ఓకే..

తనిఖీల్లో వీకే..



- ఇదీ కాకినాడ జిల్లాలో రవాణా శాఖ పరిస్థితి
- 2024-25 ఆర్థిక సంవత్సరంలో లక్ష్యానికి చేరువ
- వాహన తనిఖీల ద్వారా వచ్చే ఆదాయంలో కాస్త వెనుకబాటు

ఆశించిన మేర ఆదాయాన్ని సమకూర్చుకుంటున్న రవాణాశాఖ.. వాహన తనిఖీల విషయంలో మాత్రం తడబడుతోంది. నిబంధనలు అతిక్రమించిన వాహనాలపై కొరడా ఝుళిపించలేకపోతోంది. సామర్థ్యాన్ని మించి సరకు రవాణా చేస్తోన్న వాహనాలను అడ్డుకోవడంలోను కాస్త ఇబ్బంది పడుతున్నట్టుగా కనిపిస్తోంది. దీనికి తనిఖీల ద్వారా వచ్చిన ఆదాయమే నిదర్శనంగా నిలుస్తోంది.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కాకినాడ జిల్లాలో రవాణాశాఖ 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఆశించిన మేరకు లక్ష్యాలు సాధించింది. త్రైమాసిక పన్ను వసూలు విషయంలో అనుకున్న లక్ష్యం కంటే నూరు శాతాన్ని మించి ఫలితం దక్కించుకుంది. తనిఖీలద్వారా మాత్రం 51.24శాతంతో కాస్త వెనుకబడింది. నూతన వాహన కొనుగోళ్లు ఉండడంతో జీవితకాల పన్ను నిర్దేశిత లక్ష్యంలో 84.1శా తానికి చేరుకోగలిగారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ఆర్థిక సంవత్సరంలో వాహనాల విక్రయాల్లో కాస్త పురోగతి కనిపించింది. తనిఖీల రాబడిలో కాస్త తిరోగమనం కనిపించింది. జిల్లాలోని జాతీయ రహదారులతోపాటు పలు కీలక మార్గాలు ఉన్నాయి. రహదారుల్లో నిబంధనల విరుద్ధంగా అనేక వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వాటికి అపరాధ రుసుము విధించాలి. ఆయా వాహనాల్లో సామర్థ్యానికి మించి సామగ్రి తరలించే వారిపైనా కేసులు పెట్టి జరిమానాలు వసూలు చేయాలి. రవాణాశాఖ నిబంధనలు ఉల్లంఘించిన వారిని గుర్తించాలి. ఇవన్నీ పక్కాగా జరిగితే ఆదాయం రావడంతోపాటు రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్టపడుతుంది. అధికారులు, సిబ్బంది కొరతతో ఈ తనిఖీలను పక్కా ప్రణాళిక ప్రకారం చేయడం సాధ్యం కావడంలేదు. రవాణాశాఖ చేయాల్సిన కొన్ని పనులను ట్రాఫిక్ పోలీసులు చేస్తుండడంతో వీరు టార్గెట్‌ను పూర్తి చేయలేకపోతున్నారు.

జిల్లాలో విభాగాలవారీగా రవాణాశాఖ రాబడి ఇలా..(రూ.కోట్లలో)

అంశం	లక్ష్యం	సాధన	శాతం
త్రైమాసిక పన్ను	38.65	53.22	137.69
జీవిత పన్ను	128.64	108.19	84.1
రుసుములు	14.31	10.83	75.66
సేవా పన్నులు	3.44	3.46	100.53
తనిఖీల ద్వారా	14.4	7.37	51.24

సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లకు... అరుంధతి నక్షత్ర దర్శనం

● కోలాహలంగా గ్రామోత్సవం
● ఆకట్టుకున్న దేవతామూర్తుల వేషధారణలు

అన్నవరం, మే 9 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి వార్షిక దివ్య కల్యాణోత్సవాల్లో మూడో రోజైన శుక్రవారం నవ దంపతులైన సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్ల అరుంధతి నక్షత్ర దర్శ నాన్ని పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి ఏడు గంటలకు స్వామి,అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తూర్పు రాజగోపురం వద్దకు మేళతాళాలతో తోడ్కొని వచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం దాంపత్యజీవితానికి ప్రతీకలైన వశిష్ట, అరుంధతి నక్షత్రాలను చూపించి వారికి అర్ఘ్యం అర్పించారు. సాయంత్రం ఐదు గంటలకు దర్బారు మండపంలో ప్రధానార్చ కుడు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పండితులు ప్రధాన ప్రవేశ స్థాలీపాక హోమాలు నిర్వహించారు. వివాహం అనంతరం అమ్మవారు మెట్టినింటికి చేరుకుని అక్కడి నుంచి మరో జీవన ప్రయాణానికి నాంది పలికేందుకు ప్రతీకగా ఈ వేడుక జరిపారు. చతుర్వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. గ్రామోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి తొమ్మిది గంటలకు స్వామి,అమ్మవార్లను రావణబ్రహ్మ వాహనంపై ఆశీనులు గావించి విహరింపజేశారు. పలు సాంస్కృతిక ప్రదర్శనల నడుమ గ్రామోత్సవం కోలాహలంగా సాగింది. స్వామివారి వాహనసేవల్లో రావణ వాహన సేవకు అధిక ప్రాధాన్యం ఉండడంతో అన్నవరం, పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి తిలకించారు. తప్పెటగుళ్ళు, కోలాటం, వివిధ దేవతా మూర్తుల వేషధారణలు విశేషంగా ఆకట్టుకున్నాయి.


రావణబ్రహ్మ వాహనంపై నూతన దంపతులైన సత్యదేవుడు, అనంతలక్ష్మి గ్రామోత్సవం


నూతన దంపతులకు అరుంధతి నక్షత్రం చూపుతున్న ఋత్వికులు



అన్నవరంలో సాంస్కృతిక కార్యక్రమాల దృశ్యాలు


విజయవాడలో భవనాన్ని ప్రారంభిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

రూ.1.30కోట్లతో రెడ్‌క్రాస్ భవనం

వర్చువల్ విధానంలో ప్రారంభించిన గవర్నర్ అబ్దుల్ నజీర్

కార్పొరేషన్ (కాకినాడ), మే 9 (ఆంధ్రజ్యోతి): రెడ్‌క్రాస్ కాకినాడ జిల్లా శాఖ రూ.1.30 కోట్లతో కాకినాడలో మూడు అంతస్తుల్లో శిశు సంరక్షణ, మహిళా సంక్షేమ, శిక్షణ కేంద్రాన్ని నిర్మించింది. ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా విజయవాడ రాజ్‌భవన్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో దీనిని గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ తన సతీమణితో కలిసి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి, రెడ్‌క్రాస్ జిల్లా, రాష్ట్ర శాఖ అధ్యక్షుడు వైడీ రామారావు, భవన నిర్మాణ దాతలు డాక్టర్ ఆలూరి విజయలక్ష్మి, ఓఎన్జీసీ చీఫ్ జనరల్ మేనేజరు జి.భాస్కర్‌రావు జెమినీ ఎడిబుల్ ఆయిల్స్ జనరల్ మేనేజరు ఎస్.గురుప్రసాద్, గవర్నర్ కార్యదర్శి హరి జనహర్‌లాల్, రెడ్‌క్రాస్ రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి ఏకే ఫరీదా, కోశాధికారి పి.రామచంద్రరాజు పాల్గొన్నారు. కింది అంతస్తులో శిశు గృహ ఏర్పాటు చేస్తున్నామని, మొదటి అంతస్తులో మహిళా శిక్షణ కేంద్రం, రెండో అంతస్తులో మహిళా అభ్యుదయ కార్యక్రమాలు నిర్వహిస్తామని కలెక్టర్ షాన్‌మోహన్, చైర్మన్ వైడీఆర్ గవర్నర్‌కు తెలిపారు. కాకినాడ శాఖ చేస్తున్న కార్యక్రమాలను గవర్నర్ ప్రశంసించి భవన నిర్మాణదాతలకు పుష్పగుచ్ఛాలిచ్చి సత్కరించారు.

ఆలిండియా సీఎస్ఎస్ఆర్ కాంపిటేషన్‌లో కాకినాడ ఏపీఎస్పీ సిబ్బందికి తృతీయం



సిబ్బంది నల్లబాబు, శివశంకర్‌లను అభినందిస్తున్న కమాండెంట్ నాగేంద్రరావు

సర్పవరం జంక్షన్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఉత్తరప్రదేశ్‌లో నిర్వహించిన కొలాప్స్‌డ్ స్ట్రక్చర్ సెర్చ్ అండ్ రెస్క్యూ (సీఎస్ఎస్ఆర్) కాంపిటేషన్‌లో కాకినాడ ఏపీఎస్పీ 3వ బెటాలియన్ ఎస్డీఆర్ఎఫ్ టీమ్ తృతీయ స్థానంలో నిలిచింది. శుక్రవారం కాకినాడ రూరల్ రమణయ్యపేట ఏపీఎస్పీలో నిర్వహించిన అభినందన సభలో ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది పి.నల్లబాబు, శివశంకర్‌లను కమాండెంట్ ముద్రగడ నాగేంద్రరావు అభినందించారు. రూ.50వేలు నగదు, మెడల్స్ అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో జరిగే పోటీల్లో మరింత ప్రతిభ చూపి ఏపీఎస్పీ బెటాలియన్‌కు పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్, అసిస్టెంట్ కమాండెంట్, ఆర్ఐ తదితరులు పాల్గొన్నారు.

వ్యాన్ ఢీకొని వృద్ధుడి మృతి


మృతిచెందిన సత్యనారాయణ

తాళ్లరేవు, మే 9 (ఆంధ్రజ్యోతి): టాటా ఏస్ గూడ్స్ వ్యాన్ ఢీకొని వృద్ధుడు మృతి చెందాడు. కాకినాడ జిల్లా కాజులూరు మండలం బ్రహ్మపురికి చెందిన మడికి సత్యనారాయణ (65) సుంకరపాలెం రోడ్డుపై వస్తుండగా వాహనం అదుపు తప్పి ఢీకొంది. దీంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. కోరింగ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు. ఈ సంఘటనపై కోరింగ ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..


మృతిచెందిన నూకరాజు

కరప, మే 9 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి చెందినట్టు కరప ఎస్ఐ తోట సునీత తెలిపారు. కాకినాడ జిల్లా కరప మండలం గొర్రిపూడి గ్రామానికి చెందిన యర్రంనీడి సత్యనూకరాజు(69)కు మతిస్థిమితం సరిగాలేక అప్పుడప్పుడు ఇంటి నుంచి వెళ్లిపోయి మళ్లీ తిరిగి వచ్చేవాడు. అలాగే ఈ నెల 8వ తేదీ రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి ఎంతసేపటికీ తిరిగి రాలేదు. శుక్రవారం ఉదయం రోడ్డుపక్కన తలకు రక్తపుగాయంతో స్పృహ లేకుండా పడి ఉన్న నూకరాజును అదే గ్రామానికి చెందిన గణేష్ గుర్తించి అతడి కుమారుడికి సమాచారం అందించాడు. గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో చనిపోయినట్టు నిర్ధారించుకున్న కుటుంబసభ్యులు కరప పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

కిక్ బాక్సింగ్‌లో ప్రతిభ

కాకినాడ క్రైం, మే 9 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ కిక్ బాక్సింగ్‌లో కె.లేఖా నిహారిక ప్రతిభ కనబరిచి జూన్ 12 నుంచి 15వ తేదీ వరకు జరిగే 30వ హంగేరియన్ వాకో వరల్డ్ కప్‌కు ఎంపికైంది. కాకినాడకు చెందిన లేఖానిహారిక ఏప్రిల్ 21 నుంచి 30 వరకు కేరళలో జరిగిన అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ శిక్షణ శిబిరంలో ప్రతిభ చాటింది. శుక్రవారం ఆమెను కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ అభినందించారు. నిహారిక చూపిన పట్టుదల, కృషి యువతకు ఆదర్శంగా నిలుస్తాయని... జూన్‌లో జరిగే వరల్డ్ కప్‌లో ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని ఆకాంక్షించారు.


నిహారికను అభినందిస్తున్న కాకనాడ ఎస్పీ

రూపాయలు పంపి.. లక్షలు లాగేసి!

- 'అమ్మ ఒడి' పేరుతో టోకరా
- అమరావతి నుంచి ఆఫీసరును మాట్లాడుతున్నానంటూ ఫోన్లు
- ఖాతాల నుంచి సొమ్ములు మాయం
- బాధితులందరిదీ పిఠాపురం నియోజకవర్గం

పిఠాపురం, మే 9 (ఆంధ్రజ్యోతి): అమరావతి నుంచి ఆఫీసరును మాట్లాడుతున్నాను. మాట్లాడేది పలానా వారేనా, మీకు గతంలో పనిచేసిన వాలంటీరు ఎలాంటి వారు.. మీకు గతేడాది అమ్మఒడి పడలేదు. ఈ ఏడాదితో కలిపి పడాలంటే నేను చెప్పినట్టు చేయండి అంటూ వాట్సాప్ షేరింగ్, ఫోన్ పేకు మొదట రూపాయి పంపి ఆపై ఓటీపీ చెప్పించుకుని బ్యాంకు ఖాతాలు నుంచి సొమ్ములు లా గేసి టోకరా వేశాడు ఒక వ్యక్తి. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో గురు, శుక్రవారాల్లో పలువురికి ఇదే విధమైన ఫోన్లు వచ్చి రూ.2లక్షలకు పైగా మోసపోయారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పిఠాపురం పట్టణం, మండలంలోని గోకివాడ, విరవాడ తదితర గ్రామాలు, గొల్లప్రోలు పట్టణాలకు చెందిన పలువురు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులకు గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఫోన్లు వచ్చాయి. అమరావతి నుంచి ఆఫీసరును మాట్లాడుతున్నానని పరిచయం చేసుకుని, తొలుత గతంలో పనిచేసిన వలంటీర్ల పనితీరు గురించి ఆరా తీశాడు. వారితో మాట్లాడుతూనే వలంటీర్లను లైన్‌లోకి తీసుకున్నాడు. ఆపై మీకు గతేడాది అమ్మ ఒడి రాలేదు మీ బ్యాంకు ఖాతాలో, ఆన్‌లైన్‌లో సమస్య ఉండటంతో ఈ పరిస్థితి ఏర్పడిందంటూ చెప్పారు. (గతేడాది ఎవ్వరికి అమ్మఒడి నిప్రభుత్వం వేయలేదు). వచ్చే నెలలో మళ్లీ అమ్మఒడి పడుతుందని, మీ ఖాతాలకు రెండేళ్ల సొమ్ములు రూ.30వేలు రావాలంటే తాను చెప్పినట్టు చేయాలని సూచించాడు. ఇది నిజమేనని నమ్మి వాట్సాప్ షేరింగ్, ఫోన్ లింకింగ్ ఆప్షన్లకు ఓకే చెప్పారు. అదే సమయంలో ఫోన్లు చేసిన వారి ఫోన్‌పేకు లేకుంటే తెలిసిన వారి ఫోన్ పే ఖాతాలకు రూపాయి పంపాడు. ఇప్పుడు మీరు ఆ తర్వాత వచ్చే లింక్‌ను క్లిక్ చేసి ఓటీపీ చెప్పాలని కోరగా వారు చెప్పేశారు. ఈ విధంగా గోకివాడకు చెందిన రాంబాబు అనే వ్యక్తి ఖాతా నుంచి రూ.36వేలు, బాలాజీ నుంచి రూ.8వేలు, అంజి నుంచి రూ.5వేలతో పాటు సుమారు 24 మంది నుంచి రూ.2వేల నుంచి 40వేల వర కూ సుమారు రూ.2లక్షలకు పైగా సొమ్ములను బ్యాంకు ఖాతాలు నుంచి లాగేశాడు. ఖాతాలు నుంచి సొమ్ములు మాయం కావడంతో మోసపోయామని గుర్తించిన వారు పోలీసులకు ఫిర్యాదులు చేశారు. ఆ వ్యక్తి నేరుగా అమ్మఒడి లబ్ధిదారులకే ఫోన్ చేయడం, అదే సమయంలో వలంటీర్లకు ఫోన్లు కలపడం వంటివి చేయడంతో ఇతను గత ప్రభుత్వంలో పనిచేసి ఈ వివరాలను తీసుకుని ఇప్పుడు ఫోన్ చేసి ఉండవచ్చని భావిస్తున్నారు. ఈ వ్యవహారం పిఠాపురం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారడంతో పాటు జనసేన పార్టీ తరపున ఇటువంటి ఫోన్లకు ఎవ్వరు స్పందించవద్దంటూ సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం సాగిస్తున్నారు.

మనస్తాపంతో యువతి ఆత్మహత్య

ఆసుపత్రి వద్ద బంధువుల ఆందోళన


పెద్దాపురంలో రోడ్డుపై ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు


నాగమల్లిక మృతదేహం

పెద్దాపురం/గండేపల్లి, మే 9(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం సురంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలో హాస్టల్ వార్డెన్‌గా పనిచేస్తున్న నిండుకుండల నాగమల్లిక (23) శుక్రవారం తెల్లవారుజామున ఆత్మహత్య చేసుకుంది. గండేపల్లి పోలీసుల వివరాల ప్రకారం.. రౌతులపూడి మండలం మెరకచామవరం గ్రామానికి చెందిన నాగమల్లిక యూనివర్సిటీలో వార్డెన్‌గా పనిచేస్తుంది. అదే గ్రామానికి చెందిన శెట్టిబత్తుల శివదుర్గ, ఆమె ప్రేమించుకున్నారు. కానీ శివ దుర్గ వివాహం చేసుకోవడానికి నిరాకరించినందున ఆమె మనస్తాపం చెంది తాను ఉంటున్న రూమ్‌లోనే సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని మరణించిందని నాగమల్లిక తల్లి అయిన దేవుడమ్మ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ శివనాగబాబు పేర్కొన్నారు. యూనివర్సిటీ యాజమాన్యం నాగమల్లిక మృతదేహాన్ని పెద్దాపురం ప్రభుత్వాసుపత్రి తరలించడంతో మృతురాలి బంధువులు, దళిత సంఘాల నాయకులు అక్కడికి చేరుకుని రహదారిపై బైఠాయించారు. నాగమల్లిక మృతిపై తమకు పలు అనుమానాలు ఉన్నాయని, పూర్తిస్థాయిలో విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకుని ఆమె కుటుంబాన్ని ఆదుకోవాలని బంధువులు డిమాండ్ చేశారు. నాగమల్లిక మృతితో ఎమ్.చామవరంలో విషాదచాయలు అలుముకున్నాయి. నిండుకుండల రమణమ్మ, దేవుడమ్మ దంపతులకు ముగ్గురు కుమార్తెలు కాగా నాగమల్లిక మూడో అమ్మాయి. అక్కలిద్దరికీ పెళ్లిళ్లు చేయగా నాగమల్లిక వార్డెన్‌గా పనిచేస్తుంది. ఆమె కుటుంబం వలస కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. మూడు నెలలు క్రితం కాకినాడ వలస వెళ్లారు.

జయలక్ష్మి కో-ఆపరేటివ్ సొసైటీ నిందితుల ఆస్తుల జప్తు

సుమారు రూ.7.10 కోట్ల విలువైన ఆస్తుల స్వాధీనానికి జీవోలు జారీ

సర్పవరం జంక్షన్, మే 9 (ఆంధ్రజ్యోతి): అధిక వడ్డీల ఆశ చూపించి కోట్లాది డిపాజిట్లు వసూలు చేసి బోర్డు తిప్పేసిన జయలక్ష్మి కోఆపరేటివ్ సొసైటీ నిందితుల ఆస్తులను అటాచ్‌మెంట్ చేస్తూ ప్రభుత్వం శుక్రవారం రెండు జీవోలు విడుదల చేసింది. దీంతో ఇప్పటివరకు ప్రభుత్వం 14 జీవోలు జారీ చేసినట్టు అయింది. కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ సర్పవరం జంక్షన్‌లో 1999లో ప్రధాన కార్యాలయంగా జయలక్ష్మి మ్యూచువల్లీ ఎయిడెడ్ మల్టీపర్పస్ కోఆపరేటివ్ సొసైటీని చైర్మన్ రాయవరపు సీతారామాంజనేయులు, వైస్ చైర్‌పర్సన్‌గా బదిరీ విశాలాక్షి తదితర డైరెక్టర్లతో ఏర్పాటు చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, విశాఖ, కృష్ణా జిల్లాల్లో 29 బ్రాంచీలతో సుమారు 19 వేలమంది నుంచి సుమారు రూ. 4580 కోట్లు డిపాజిట్లు సేకరించారు. బాండ్ల కాలపరిమితి దాటినా డబ్బులు చెల్లించకపోవడంతో బాధితులు ఆందోళనచేపట్టగా, 6 ఏప్రిల్ 2022న సొసైటీ చైర్మన్,వైస్ చైర్మన్, డైరెక్టర్లు బోర్డు తిప్పేసి పరారయ్యారు. ఆర్థికమోసానికి పాల్పడిన జయలక్ష్మి పాలకవర్గం సభ్యులను అరెస్ట్ చేసి న్యాయం చేయాలని బాధితులు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం సహకార శాఖ ద్వారా ఈ కేసును సీబీసీఐడీకి అప్పగించింది. డిపాజిటర్ల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం జప్తు చేసిన ఆస్తులపై నియంత్రణను అమలు చేసేందుకు చర్యలు చేపట్టింది. ఈ కుంభకోణానికి ప్రధాన సూత్రదారులైన జయలక్ష్మి సొసైటీ చైర్మన్, వైస్ చైర్మన్లు ఇతర డైరెక్టర్లుపై కేసు నమోదు చేసిన సీబీసీఐడీ అధికారులు అరెస్ట్ చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. నిందితులకు చెందిన ఆస్తుల స్వాధీనానికి ప్రభుత్వం వేర్వేరుగా 12 జీవోలను జారీ చేసింది. సుమారు 98 ఆస్తులకు చెందిన రూ.450 కోట్ల విలువైన స్థిరాస్తులను సొసైటీ చొరవతో సీఐడీ సీజ్ చేసి కోర్టుకు అటాచ్‌మెంట్ చేసింది. శుక్రవారం నిందితుల ఆస్తులను అటాచ్‌మెంట్ చేస్తూ మరో రెండు జీవోలు విడుదల చేసింది. ఇందులో విశాఖపట్నం చంద్రంపాలెంకు చెందిన చుండూరి శివసూర్యవెంకటశ్రీనివాస్ పేరుపై శ్రీకాకుళం జిల్లా ఎచ్చర్ల మండలం ధర్మవరం, అనకాపల్లి జిల్లా చోడవరం, కాకినాడ రూరల్ మండలం చీడిగ, తిమ్మాపురం, కొత్తపల్లి మండలం కొమరగిరి, పొన్నాడ, పిఠాపురం, కొత్తపల్లి, సామర్లకోట మండలం కొప్పవరం, కాకినాడ అర్బన్ రామారావుపేట, మెహర్‌నగర్ పలు ప్రాంతాల్లో ఉన్న సుమారు రూ.7.10 కోట్ల ఖరీదు చేసే పలు ప్లాట్లు, స్థిరాస్తులను సీజ్ చేస్తూ ప్రభుత్వం 77 పేరుతో జీవో జారీ చేసింది. అలాగే జీవో నెం.78 పేరుతో నిందితుల నుంచి అటాచ్‌మెంట్ చేసిన ఆస్తులపై స్వాధీనం కోసం, నియంత్రణ చేస్తూ సంబంధిత కోర్టు ముందు దరఖాస్తు దాఖలుచేసేందుకు ఏపీ మంగళగిరి నేర పరిశోధనా విభాగం డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌కి అధికారం అప్పగిస్తూ తదుపరి చర్యలు తీసుకోవాలని, అనంతరం నివేదికను ప్రభుత్వానికి పంపాలని ఆదేశాలు జారీ చేస్తూ 78పేరుతో జీవో జారీ చేసింది. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న ఆస్తుల స్వాధీనం, సేల్ ఆర్డర్ కోసం సత్వరమే ప్రభుత్వ, న్యాయపరమైన అనుమతులు వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు. మరో మూడు జీవోలను కూడా సత్వరమే విడుదల చేసి, తదుపరి ప్రక్రియను వేగవంతం చేయాలని వారు కోరుతున్నారు.

35,94,774 విద్యార్థిమిత్ర కిట్లు సిద్ధం

రాష్ట్ర పరిశీలకుడు అబ్దుల్ గని

ఉప్పలగుప్తం, మే 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యార్థులకు పంపిణీ చేసేందుకు 35,94,774 డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లు సిద్ధంగా ఉన్నట్టు రాష్ట్ర పరిశీలకుడు అబ్దుల్‌గని తెలిపారు. కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం విద్యావనరుల కేంద్రంలో శుక్రవారం ఆయన కిట్లు పంపిణీకి నియమించిన బృందాలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కిట్లు పంపిణీ, కిట్లలోని ఎనిమిది యూనిట్లపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత పాఠశాలల వరకు విద్యార్థులకు పుస్తకాలు బరువు తగ్గించే ప్రణాళిక అమలు చేస్తున్నట్టు వివరించారు. ఆరో తరగతికి హిందీ పుస్తకం ఉండదన్నారు. 6,7 తరగతులకు లాంగ్వేజస్ ఒక పుస్తకం, నాన్‌లాంగ్వేజస్ విడివిడిగా ఉంటాయన్నారు. 1,2 తరగతులకు తెలుగు, ఇంగ్లీషు, గణితం కలిపి ఒకే పుస్తకం ఉంటుందన్నారు. విద్యార్థిమిత్ర జిల్లా పరిశీలకుడు బీవీవీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ జిల్లాలో 97,078 విద్యార్థిమిత్ర కిట్లు పంపిణీ చేస్తామన్నారు. ఏకరూప దుస్తుల కోసం వస్త్రం సరఫరా చేసి, ప్రతి జతకు కుట్టుకూలిగా రూ.200 తల్లుల ఖాతాలో జమచేస్తామన్నారు. ఎంఈవోలు కె.కిరణ్‌బాబు,సత్తి సత్యకృష్ణ పాల్గొన్నారు.

మావోయిస్టుల మృతదేహాల అప్పగింత

రంపచోడవరం, మే 9 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా వై.రామవరం మండలం శేషసాయి అటవీ ప్రాంతంలో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్టు స్పెషల్ జోనల్ కమాండర్ జగన్, డిస్ట్రిక్ కమాండర్ రమేష్ మృతదేహాలను రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించారు. మృతదేహాలను వారి బంధువులకు పోలీసులు అప్పగించారు.

లక్ష్మీదేవిలంకలో చోరీ

55 గ్రాముల బంగారం, 39 తులాల వెండి మాయం


ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీమ్, పోలీసులు


ముమ్మిడివరం, మే 9 (ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు పడి వెండి, బంగారు వస్తువులు అపహరించుకుపోయారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం అన్నంపల్లి పంచాయతీ పరిధిలోని లక్ష్మీదేవిలంకలో చోరీ జరిగింది. లక్ష్మీదేవిలంకకు చెందిన కడలి పద్మావతి బుధవారం సామర్లకోటలోని బంధువుల ఇంటికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. అయితే బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్న పద్మావతి మరిది హేమరాజు శుక్రవారం పద్మావతి ఇంటి వద్ద పెట్టిన మోటారుసైకిల్‌ను తీసుకునేందుకు వెళ్లగా తలుపుల తాళాలు తెరిచి ఉండడంతో అనుమానం వచ్చి పద్మావతికి ఫోన్ చేశాడు. ఇంటి వెనుకకు వెళ్లిచూడగా తలుపులు పెకిలించి ఉండడం, బీరువా తాళాలు తీసి ఉండడంతో విషయాన్ని పద్మావతికి చెప్పడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. బీరువాలో ఉంచిన 55 గ్రాముల బంగారపు వస్తువులు, 39తులాల వెండి వస్తువులు, రూ.20వేల నగదును దొంగలు అపహరించుకుపోయినట్టు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. పద్మావతి భర్త ఉపాధి నిమిత్తం గల్ఫ్‌లో ఉండగా పద్మావతి తల్లి, కుమారుడు, అక్క కుమార్తె ఇంట్లో ఉంటున్నారు. ప్రస్తుతం వారంతా బంధువుల ఇంటికి ఊరు వెళ్లిన సమయంలో చోరీ జరిగింది. సీఐ ఎం.మోహన్‌కుమార్, ఎస్ఐ డి.జ్వాలాసాగర్ సంఘటనా స్థలానికి వెళ్లి చోరీకి సంబంధించిన ఆధారాలు సేకరించారు. క్లూస్‌టీం బృందం వచ్చి ఆధారాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ఎస్ఐ కేసు దర్యాప్తు చేపట్టారు.

అల్లుకుంది ఆపద!

కాకినాడలోని కొండయ్యపాలెం బ్రిడ్జి వద్ద అపార్టమెంట్ల సమీపంలో విద్యుత్ స్తంభానికి ఓ మొక్క అల్లుకుంది. అయితే వర్షాలు కురిస్తే విద్యుత్ ప్రమాదం సంభవించే అవకాశం లేకపోలేదు.

- ఫొటోగ్రాఫర్, కాకినాడ






వసంతకాల వేళ.. అదిరేల

వసంతకాలం వచ్చిందంటే చెట్లు చిగురిస్తాయి, పుష్పాలు విచ్చుకుని ఆహ్లాదాన్ని, ఆనందాన్ని పంచుతాయి. రాజమహేంద్రవరం టీనగర్ లో గోదావరి బండ్ వైపు రేల చెట్లు పుష్పించాయి. చూడముచ్చటగా పసుపు పందిరి మాదిరిగా కనిపిస్తున్నాయి. అటుగా వెళ్లేవారిని ఆకర్షిస్తున్నాయి.
- ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

కాకినాడ

దోమాడలో జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ

కాకినాడ సిటీ, మే 9 (ఆంధ్రజ్యోతి): పెదపూడి మండలం దోమాడలో మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం విగ్రహానికి పాలాభిషేకం చేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



ఉప్పాడ బీచ్ రోడ్డులో ట్రాక్టర్లపై ఎండు గడ్డిని తరలిస్తున్న దృశ్యం

కోత ఎండు గడ్డికి డిమాండ్

ఎకరం ఎండు గడ్డి రూ.6వేలు పైమాటే

కొత్తపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో కూలీలతో కోత కోయించిన ఎండు గడ్డికి మంచి డిమాండ్ వుంది. ఎకరం ఎండి గడ్డి రూ.6వేలు నుంచి రూ.8వేలు పలుకుతోంది. గత నాలుగైదేళ్లుగా వ్యవసాయ పనులకు కూలీలు దొరక్కపోవడంతో రైతులు కోత కోసేందుకు యంత్రాలను వినియోగిస్తున్నారు. కొందరు రైతులు యంత్రాలతోను, మరికొందరు రైతులు బెంగాల్, ఒడిశా కూలీలతోను వరి నాట్లు వేయించుకొంటున్నారు. యంత్రం ఎకరం చేనును గంటన్నరలోనే కోసేస్తుంది. అయితే యంత్రాల ద్వారా కోసిన పంట గడ్డి ముక్కలుగా తెగిపోవడంతో చేలల్లోనే వదిలేస్తున్నారు. కూలీలతో కోత కోయించిన గడ్డి పొడవుగా ఉంటుంది. పలు గ్రామాల్లో కూలీలతో కోత కోయించడంతో ఆ గడ్డిని ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన టోకు కొనుగోలుదారులు ఎంత రేటుకైనా కొనుగోలు చేస్తున్నారు. దీంతో మండలంలో అక్కడక్కడ కూలీలతో కోత కోత కోయించిన రైతుల వద్దకు కొనుగోలుదారులు వెళ్లి గడ్డిని సేకరిస్తున్నారు. వాటిని కాకినాడ, నక్కపల్లి, తుని, విశాఖపట్నం ప్రాంతాలకు ట్రాక్టర్లపై రవాణా చేస్తున్నారు. కూలీలతో కోత కోయించిన గడ్డిని గ్రామాల్లో సేకరించడం కష్టంగా మారిందని నక్కపల్లికి చెందిన గడ్డి వ్యాపారి అర్జునరావు చెప్పారు.



ఎంపీ సతీష్‌బాబును కలిసిన ఆర్‌ఎంసీ ప్రిన్సిపాల్

కాకినాడ సిటీ, మే 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రంగరాయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ విష్ణు వర్ధన్ శుక్రవారం రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబును కలిశారు. ఆయన్ను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

బీజేఎంసీ జిల్లా అధ్యక్షుడిగా జోగారావు



పిఠాపురం, మే 9 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా మజ్దూర్ సెల్ కాకినాడ జిల్లా అధ్యక్షుడిగా పిఠాపురానికి చెందిన ఎం.శ్రీరామజోగారావు నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ అధ్యక్షుడు అర్నాబ్ చటర్జీ, ఏపీ అధ్యక్షుడు ఎస్‌కే బాషా నియమాక ఉత్తర్వులు అందజేశారు. కార్మికుల సంక్షేమానికి అంకితభావంతో పనిచేస్తానని జోగారావు చెప్పారు.



కాకినాడ: ఎంపీ సతీష్ కార్యాలయంలో అర్జీలు స్వీకరిస్తున్న నాయకులు



పిఠాపురం: ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

టీడీపీ కార్యాలయాల్లో ప్రజాదర్బార్

కాకినాడ సిటీ, మే 9 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి ఏసుదాసు, జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస బాబా, మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు, మాజీ డిప్యూటీ మేయర్ అరిగెల శ్రీనివాసరావు (బున్ని), నాయకులు తలాటం హరీష్, న్యూటన్ ఆనంద్ అర్జీలు స్వీకరించి సత్వర పరిష్కార చర్యలు చేపట్టారు. సానా సతీష్ బాబు ఫౌండేషన్ ద్వారా అభ్యర్థులకు డీఎస్సీ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీ కార్యాలయ ఇన్‌చార్జి, జీజీహెచ్ అభివృద్ధి కమిటీ సభ్యుడు మేకా లక్ష్మణమూర్తి, వేటుకూరి నాగమణి, చింతపల్లి అర్జున్, యాళ్ల రాజా తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ప్రజలు, కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించారు. టిడ్కో అపార్ట్‌మెంట్లు అప్పగించకపోవడం, ఇప్పుడు బ్యాంకులు రుణాలు ఇవ్వట్లేదని, వయసు మీరిందని చెప్తున్నారని పలువురు విన్నవించారు. పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



విద్యా మనో విజ్ఞాన శాస్త్రం స్టడీ మెటీరియల్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నేతలు

13న డీఎస్సీ అవగాహన సదస్సు

కాకినాడ సిటీ, మే 9 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ 13వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు కాకినాడ సూర్యకళామందిరంలో డీఎస్సీపై అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్టు రాష్ట్ర కార్యదర్శి టి.రవిచక్రవర్తి, పూర్వ కార్యదర్శి జి.ప్రభాకర వర్మ వెల్లడించారు. శుక్రవారం యూటీఎఫ్ హోంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యా మనో విజ్ఞాన శాస్త్రం స్టడీ మెటీరియల్ పుస్తకాలను నేతలు ఆవిష్కరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీవీ నగేష్, కార్యదర్శులు టి.రామలక్ష్మి, కె.పెద్దిరాజు, నాయకులు కె.ఈశ్వరరావు, జి.మాణిక్యం తదితరులు పాల్గొన్నారు

జీజీహెచ్‌కు రిఫ్రిజిరేటర్ విరాళం

జీజీహెచ్ (కాకినాడ), మే 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌కు గుణ్ణం చంద్ర మౌళి చారిటబుల్ ట్రస్టు, ప్రియాంక మినరల్స్ (కాకినాడ) 500 లీటర్ల సామర్థ్యం గల వోల్టాస్ రిఫ్రిజిరేటర్‌ను విరాళంగా అందజేశారు. సంబంధిత పత్రాలను జీజీహెచ్ సూపరింటెండెంట్ ఎంపీఆర్ విఠల్‌కు హీమోఫీలియా సొసైటీ విజయవాడ చాప్టర్ కార్యదర్శి డాక్టర్ మాగంటి ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం అందజేశారు. కాకినాడ జిల్లా గ్రూప్ కో-ఆర్డినేటర్ సమన్వయంతో అందజేసిన ఈ విరాళం మెరుగైన వైద్యసేవలందించడంలో ఉపయోగకరంగా ఉంటుందని సూపరింటెండెంట్ చెప్పారు.

'మరోసారి శంకుస్థాపన పేరుతో కుల రాజకీయం తగదు'

కాకినాడ సిటీ, మే 9 (ఆంధ్రజ్యోతి): ఒకసారి శంకుస్థాపన చేసిన కల్యాణ మండపానికి మరోసారి శంకుస్థాపన పేరుతో సంఘీయుల మధ్య కుల రాజకీయం చేయడం తగదని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పద్మశాలీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి పెనుగొండ శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి అందే వీరబాబు, సభ్యుడు కవతవరపు నాగేశ్వరరావు హితవు పలికారు. శుక్రవారం జగన్నాథపురంలోని సంఘ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత ప్రభుత్వం కాకినాడ వెంకట్‌నగర్‌లో పద్మశాలీ సంక్షేమ సంఘానికి వెయ్యి గజాల స్థలం కేటాయించిందన్నారు. అందులో కల్యాణ మండపం నిర్మాణానికి అప్పటి ప్రజా ప్రతినిధితో పాటు ఉమ్మడి జిల్లా పద్మశాలీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పంపన రామకృష్ణ, పెద్దల ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారన్నారు. ఇటీవల నూతనంగా ఏర్పాటైన కాకినాడ పద్మశాలీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మరోసారి శంకుస్థాపనకు సిద్ధమవుతూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పంపన రామకృష్ణ, పలువురు నేతల పేర్లు ఆహ్వాన పత్రికలో వేయకపోవడం దురదృష్టకరమన్నారు. సమావేశంలో సంఘ నాయకులు గొడుగుల కొండబాబు, అందే రామకృష్ణ, పంపన దుర్గాప్రసాద్, పప్పు నాగేశ్వరరావు, గొడుగుల నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

110కి మందికి ఉద్యోగాలు

కార్పొరేషన్ (కాకినాడ), మే 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఉపాధి కార్యాలయంలో జిల్లా ఉపాధి అధికారి వసంత ఆధ్వర్యంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. 110 మంది అభ్యర్థులు హాజరు కాగా ప్రముఖ కంపెనీలు ప్రతినిధులు వారిని ఇంటర్వ్యూ చేసి 45 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు.



పిఠాపురం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

పిఠాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రాజారావు

పిఠాపురం, మే 9 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మేరుగు రాజారావు ఎన్నికయ్యారు. ఈయన వరుసగా ఆరోసారి విజయం సాధించారు. పట్టణంలోని కోర్టుల ప్రాంగణంలో శుక్రవారం జరిగిన ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా పిట్టా రాజేంద్రప్రసాద్, కోశాధికారిగా గౌతు రాజా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా ముమ్మిడి రామకృష్ణ, జాయింట్ సెక్రటరీగా ముమ్మిడి శ్రీనివాస్, స్పోర్ట్స్ సెక్రటరీగా ఎంవీవీఎస్ సత్యనారాయణ, లైబ్రరీ సెక్రటరీగా జీఎస్ భాస్కరాచార్యులు, మహిళా ప్రతినిధిగా సత్యవాణిశ్రీ, సీనియర్ ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా సరిదే నాగేశ్వరరావు, సీహెచ్ ప్రేమ్‌జీ, జూనియర్ సభ్యులుగా రావుల రమేష్, జీవీవీ సత్యనారాయణ, మహిళా సభ్యురాలిగా అల్లాడ గీత ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా బత్తిన లక్ష్మణదొర, జీవీ రమణారావు, కొత్త సురేష్ వ్యవహరించారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ అన్సర్ అలీ

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

కాకినాడ సిటీ, మే 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక రేచర్లపేటలోని మస్జీద్-ఆల్-ఫరాన్ ప్రాంగణంలో శుక్రవారం నమాజ్ అనంతరం నూర్ బాషా సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. మస్జీద్-ఆల్-ఫరాన్ కమిటీ, దఫైన్ ఇనిస్టిట్యూట్ నేతృత్వంలో జరిగిన సదస్సుకు మస్జీద్ అధ్యక్షుడు ఎస్‌కే నయీం అధ్యక్షత వహించారు. కెరీర్ గైడెన్స్ నిపుణులు ప్రొఫెసర్ అన్సర్ అలీ, అబ్దుల్ అజీజ్ వివిధ అంశాల్లో అవగాహన కల్పించారు.

మండలానికి చేరిన పాఠ్యపుస్తకాలు

గొల్లప్రోలు రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలానికి సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లు వచ్చాయి. 44 పాఠశాలల్లోని విద్యార్థులకు 22,481 పాఠ్య పుస్తకాలు అవసరం కాగా ఇప్పటికే 18,562 పుస్తకాలు వచ్చాయని, 30,892 నోటు పుస్తకాలు అవసరం కాగా నూరు శాతం వచ్చాయని ఎంఈవో శివప్రసాద్ తెలిపారు. మిగిలిన పాఠ్య పుస్తకాలు 15వ తేదీలోగా వస్తాయన్నారు. జూన్ మొదటి వారానికే వీటిని పాఠశాలలకు చేరుస్తామని చెప్పారు.

అపర్ణాదేవికి పూజలు

గొల్లప్రోలు రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): 'ఆపరేషన్ సిందూర్' విజయవంతం కావాలని తాటిపర్తి అపర్ణాదేవికి శుక్రవారం తెల్ల జిల్లేడు పుష్పాలతో పూజలు, కుంకుమార్చన జరిపారు. వేద పండితుడు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ప్రధాన అర్చకుడు ప్రభాకరశాస్త్రి ఆధ్వర్యంలో పూజలు చేయగా ఆలయ కమిటీ చైర్మన్ కుంపట్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

మంగళగిరి తరలిన అనాథలు

పిఠాపురం, మే 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో అనాథలైన 18 సంవత్సరాలలోపు బాలబాలికలు, వారి సంరక్షకులతో మంగళగిరిలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సమావేశం నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో వీరిని గుర్తించి రెండు ప్రత్యేక బస్సుల్లో పంపారు. నియోజకవర్గంలో ఉత్తమ సేవలు అందిస్తున్న ఎనిమిది మంది స్టాఫ్ నర్సులకు పవన్‌తో సమావేశానికి ఆహ్వానం అందడంతో వారు తరలివెళ్లారు. పాడా ప్రాజెక్టు డైరెక్టర్ చైత్రవర్షిణి పిల్లలు, సంరక్షకులతో మాట్లాడి దగ్గరుండి బస్సులు ఎక్కించారు.





భావనారాయణస్వామిని దర్శించుకుంటున్న బీజేపీ నాయకుడు వెంకటేశ్వరరావు

భారత సైనికుల ఆరోగ్యం కోరుతూ పూజలు

సర్పవరం జంక్షన్, మే 9 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులపై చేస్తున్న పోరాటంలో భారత సైనికులంతా పూర్తి ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తూ బీజేపీ కాకినాడ పార్లమెంటరీ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు సర్పవరం భావనారాయణస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు పి.లీలావతి, పాలిక శివ, పెంకే అరుణ్‌ప్రకాశ్, కోమర్తి మురళి, లోవరాజు, మేడిశెట్టి త్రిమూర్తులు, గుబ్బల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రసాయన పరిశ్రమల్లో అప్రమత్తత అవసరం

పెద్దాపురం, మే 9 (ఆంధ్రజ్యోతి): దేశ సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ప్రమాదకర రసాయన పరిశ్రమలు ఉన్న ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి సూచించారు. శుక్రవారం ఆమె డివిజన్ పరిధిలోని ప్రమాదకర రసాయన పరిశ్రమల యాజమాన్యాల ప్రతినిధులు, పరిశ్రమల శాఖ అధికారులతో సమీక్షించారు. రసాయనాలు తయారుచేసే పరిశ్రమల చుట్టూ నివాసం ఉంటున్న ప్రజలకు అనుకోని సంఘటనలు చోటుచేసుకున్న సందర్భాలు, ఇతర సంక్షోభ సమయాల్లో అనుసరించే విధానాలపై ఆయా పరిశ్రమల యాజమాన్యాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఏవీ మురళీకృష్ణ, పెద్దాపురం డీఎస్పీ డి.శ్రీహరిరాజు, కేబీకే బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్, అపర్ణ ఎంటర్‌ప్రైజెస్, ఏఎల్ సామి ఆగ్రో ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, రాయల్ ఇంపోర్ట్ అండ్ ఎక్స్‌పోర్ట్స్, అవంతి ఫ్రోజెన్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, దేవి ఫిషరీస్ లిమిటెడ్, సిగ్మా సీఫుడ్స్, నెక్కంటి సీఫుడ్స్ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.



బాలవికాస్ శిక్షణ తరగతుల ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఉమర్‌ఆలీషా

ముగిసిన బాల వికాస్ వేసవి ఉచిత శిక్షణ శిబిరం

పిఠాపురం, మే 9 (ఆంధ్రజ్యోతి): తాత్విక బాల వికాస శిక్షణ చిన్నారుల ఆదర్శవంతమైన జీవనానికి సోపానంగా మారుతుందని విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా అన్నారు. పీఠం నూతన ఆశ్రమ ప్రాంగణంలో జరిగిన తాత్విక బాల వికాస్ వేసవి శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. ఉమర్‌ఆలీషా పాల్గొని బాలబాలికలకు సర్టిఫికెట్లు, ఆన్‌లైన్‌లో 80 ఆదివారాలపాటు బాల వికాస్ కార్యక్రమంలో పాల్గొన్న వారికి స్నాతకోత్సవం నిర్వహించి పట్టాలను ప్రదానం చేశారు. మెంటార్లు, శిక్షకులను సన్మానించారు. పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు, యర్రంశెట్టి ఉమామహేశ్వరరావు, ఏవీవీ సత్యనారాయణ, అరుణకుమారి, వెంకటలక్ష్మి, జయలక్ష్మి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయ సాగు చేస్తున్న రైతులను సన్మానిస్తున్న దృశ్యం

ప్రకృతి వ్యవసాయ రైతులకు సన్మానం

తాళ్లరేవు, మే 9 (ఆంధ్రజ్యోతి): రైతులంతా ప్రకృతి వ్యవసాయం వైపు పయనం సాగిస్తే లాభాలు తథ్యమని వ్యవసాయ శాఖ కరప సబ్ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ కె.బాబూరావు అన్నారు. శుక్రవారం పి.మల్లవరం సర్పంచ్ పంపన రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను సన్మానించారు. కృషి అమృత్ గో ఆధారిత ప్రకృతి వ్యవసాయ క్షేత్రం రైతు ధూళిపూడి వెంకటరమణ, రైతులు దడాల సత్తికొండ, రాయుడు సింహాచలం, బాదం ఏడుకొండలు, అబ్బిరెడ్డి నాగేశ్వరరావు, విళ్ల సత్యనారాయణ, పేరాబత్తుల భైరవమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎండ తీవ్రత, ఉక్కపోత

కొత్తపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం ఎండ తీవ్రత, విపరీతమైన ఉక్కపోతతో ప్రజలు సతమతమయ్యారు. ఉదయం 11 గంటలకే ఎండ తీవ్రత మొదలైంది. దీంతో అత్యవసర పరిస్థితుల్లో పనులపై బయటకు వెళ్లాల్సిన వారు గొడుగు సాయంతో పనులు చక్కబెట్టుకుని తిరిగి ఇళ్లకు చేరుకున్నారు. ఏసీలు అన్నీ ఒకేసారి పని చేయడంతో ట్రాన్స్‌ఫార్మర్లు ట్రిప్ అవుతూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. మధ్యాహ్నం 12గంటలకు ఎండ తీవ్రతకు ఇళ్ల డాబాలపై ఉన్న వాటర్ ట్యాంకుల్లో నీరు మరుగుతోంది. శుక్రవారం 33 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.



పట్టణంలోని సీతయ్యగారితోటలో గల జనసేన కార్యాలయంలో ఆ పార్టీ క్రియాశీలక సభ్యత్వాల కిట్లను పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు శుక్రవారం పంపిణీ చేశారు. వీటిని సభ్యత్వాలు తీసుకున్న వారికి అందజేయాలని ఆయన సూచించారు.

- పిఠాపురం (ఆంధ్రజ్యోతి)

పిఠాపురంలో పోలీసుల తనిఖీలు



వాహనాన్ని తనిఖీ చేస్తున్న సీఐ, ఎస్ఐ

పిఠాపురం, మే 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లాడ్జీల్లో పోలీసులు శుక్రవారం సాయంత్రం తనిఖీలు నిర్వహించారు. లాడ్జీల్లో ఉంటున్న వారి వివరాలు తీసుకుని వారి పత్రాలను పరిశీలించారు. అనుమానస్పద వ్యక్తులు ఎవరైనా వస్తే వెంటనే సమాచారం అందించాలని సూచించారు. అనంతరం ఉప్పాడ సెంటర్ తదితర ప్రాంతాల్లో వాహనాలను తనిఖీ చేశారు. రికార్డులు లేని వాహనాలను సీజ్ చేసి జరిమానా విధించారు. తనిఖీల్లో పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, పట్టణ ఎస్ఐ మణికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌బీకేల వద్ద అమ్మకానికి 30 రకాల విత్తనాలు

ప్రత్తిపాడు, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతు భరోసా కేంద్రాల వద్ద 30 రకాల వివిధ జాతుల విత్తనాలు సిద్ధంగా ఉంచినట్టు మండల వ్యవసాయాధికారి వైవీ గంగాధర్ తెలిపారు. లంపకలోవ, రాచపల్లి ఆ ర్‌బీకే కేంద్రాల వద్ద విత్తన అమ్మక ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. సీఎండీఎస్ సాగు పద్ధతిలో 30 రకాల వివిధ జాతులవిత్తనాలు ఆర్‌బీకేల వద్ద ఉన్నాయన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

పీసా గ్రామసభలు లేకుండా అభివృద్ధి పనులు

● ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు తీగల బాబూరావు

రంపచోడవరం, మే 9 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లాలోని పాడేరు, చింతూరు, రంపచోడవరం డివిజన్లలోని గ్రామాల్లో పీసా గ్రామసభ తీర్మానాలు లేకుండా ఉపాధి హామీ పనులు, పలు అభివృద్ధి పనులు చేపట్టడం అవినీతికి సహకరించడమే అవుతుందని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు తీగల బాబురావు అన్నారు. ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశాల్లో టెంట్, ప్రథమ చికిత్సపెట్టె, మంచినీటి సదుపాయం, చిన్నపిల్లలు ఉంటే ఆయా సదుపాయాలు ఉండటం లేదన్నారు. మండలస్థాయి అధికారులు, సిబ్బంది చట్టాలను ఉల్లంఘిస్తున్నారని ఆరోపించారు. గృహ నిర్మాణశాఖ ద్వారా చేపట్టిన పనులలో చెల్లింపులలో జాప్యాలు జరుగుతున్నాయని, కమిషన్ల కోసం అధికారులు అనర్హులకు గృహాలు మంజూరు చేస్తున్నారన్నారు. పీసా, ఉపాధి చట్టాలను ఉల్లంఘించిన అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లనున్నట్లు తెలిపారు.

ప్రతి సమస్య పరిష్కరిస్తాం: ఎమ్మెల్యే శిరీషదేవి



ఇందుకూరుపేట ప్రజా దర్బార్ లో సేకరిస్తున్న ఎమ్మెల్యే శిరీష దేవి

దేవీపట్నం, మే 9(ఆంధ్రజ్యోతి): ప్రజల ప్రతి సమస్య పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు విజయభాస్కర్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఇందూకూరుపేట వెలుగు కార్యాలయంవద్ద ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యేను నాయకులు శాలువాతో సత్కరించారు అనంతరం వినతులు స్వీకరించారు. ప్రతి సమస్య పరిష్కరిస్తామని ఎమ్మెల్యే ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ మండల వ్యవసాయ అధికారి ఆర్. ప్రశాంతి, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి సురేష్, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు సచివాలయ చిబ్బంది, మండల కన్వీనర్ మరిశెట్ల వెంటేశ్వరరావు. జనసేన, బీజేపీ నాయకులు, దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజమణి, మగుపు బాబారావు తైలం గంగాధర్ రావు గోళ్ళ చంటిబాబు ముచ్చి వీర వెంకటసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితుల సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళతాం'

పోలవరం నిర్వాసితుల సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారాలోకేష్ దృష్టికి తీసుకెళతామని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి నియోజకవర్గ తెలుగు యువ త అధ్యక్షుడు మఠం విజయభాస్కర్ అన్నారు. శుక్రవారం మండలంలో ఇందుకూరుపేట గ్రా మ సమీపంలో వెలుగు కార్యాలయ ంలో ఏర్పా టు చేసిన ప్రజాదర్బార్‌లో పోలవరం ప్రాజెక్టులో ముంపు గురైన 44 గ్రామాల నిర్వాసితుల సమస్యలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే పోలవరం నిర్వాసితుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని నిర్వాసితులకు హామీ ఇచ్చారు.

పొల్లూరు జల విద్యుత్ కేంద్రం వద్ద మాక్ డ్రిల్



పొల్లూరు జల విద్యుత్ కేంద్రం వద్ద మాక్ డ్రిల్ దృశ్యం

మోతుగూడెం, మే 9 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం పొల్లూరు జల విద్యుత్ కేంద్రం వద్ద జెన్‌కో సెక్యూరిటీ విభాగం ఉద్యోగులు, అధికారులు మాక్ డ్రిల్ నిర్వహించారు. ప్రతి స్పందన సంసిద్ధత ప్రతి స్పందన స్వార్థపరులు అంచనా వేసేందుకు జెన్‌కో సెక్యూరిటీ విభాగం చేపట్టిన కార్యక్రమం యుద్ధం సన్నద్ధతను విపత్తు నిర్వహణలో భాగంగా పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి వివరించారు. ఈ సందర్భంగా లోయర్ సీలేరు జెన్‌కో అధికారి మాట్లాడుతూ అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించేందుకు మాక్ డ్రిల్ దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ ప్లాంట్ మేనేజర్ ఏఈలు రాజేష్, వీవీ రావు, తదితరులు జెన్‌కో ఉద్యోగస్తులు, కాంట్రాక్ట్ కార్మికులు, జెన్‌కో సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీ చట్టాల అమలుకు ఉద్యమించాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

రంపచోడవరం, మే 9(ఆంధ్రజ్యోతి): అడవులు, అటవీ ఖనిజ సంపదలను సామ్రాజ్యవాదులు, కార్పొరేట్లకు కట్టబెడుతున్న తీరును ప్రతిఘటించాలని, ఆదివాసీ రక్షణచట్టాల అమలుకోసం ఉద్యమించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ప ల్లాల లచ్చిరెడ్డి అన్నారు. ఈ మేర కు ఈనెల 14వ తేదీ బుధవారం రంపచోడవరంలో ప్రదర్శన జరిగే సదస్సు కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. సదస్సుకు ఏఐకేఎంఎస్ జాతీయ నాయకురాలు టాన్యా, ఝాన్సీ, రాష్ట్ర నాయకులు తలారి ప్రకాష్ తదితరులు హాజరవుతారని, ఆదివాసీలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

'టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి'



ఎన్నికైన సభ్యులకు ధ్రువపత్రాలు అందిస్తున్న టీడీపీ నాయకులు

రంపచోడవరం, మే 9 (ఆంధ్రజ్యోతి): కొత్తగా ఎంపికైన టీడీపీ గ్రామకమిటీ సభ్యులు గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు అడబాల బాపిరాజు అన్నారు. శుక్రవారం అడ్‌హక్ కమిటీ సభ్యులు మండలంలోని పెదెగెద్దాడలో నూతన గ్రామకమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా ఎం.అన్నవరం, అన్నిక అప్పారావులను నియమించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెంటపాటి అనంతమోహన్, సలాది బాపిరాజు, సిద్ద వెంకన్నదొర, కడబాల ఈశ్వర రావు, కడబాల సూరిబాబు, తీగల రాజారావు పాల్గొన్నారు.

మోతుగూడెం గ్రామ కమిటీ ఏకగ్రీవం

మోతుగూడెం, మే 9(ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెంలో టీడీపీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో భాగంగా మోతుగూడెం గ్రామశాఖ ఎన్నికలు అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో మోతుగూడెం గ్రామశాఖ అధ్యక్షుడిగా దొడ్డి యేసును, ప్రధాన కార్యదర్శిగా కరణ శ్రీనుబాబును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మోతుగూడెం ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు, అడ్‌హక్ కమిటీ సభ్యులు ఎండీ జహంగీర్, ఇల్ల చిన్నరెడ్డి, ఎండీ జమాల్‌ఖాన్, నరసింహారావు చౌదరి, సురేష్‌చౌదరి, చంద్రయ్య, శీలం తమ్మయ్య, వెంకటేశ్వరరావు, ఆసిఫ్ పాల్గొన్నారు.

టీడీపీ మండల కమిటీ సమావేశం

వీఆర్‌పురం, మే 9 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల కమిటీ సమావేశం శుక్రవారం రేఖపల్లిలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించారు. పోలవరం నిర్వాసితుల సమస్యలను, కూటమి ప్రభుత్వం చేస్తున్న పని తీరుపట్ల ఎమ్మెల్యే మిర్యాల శిరీషాదేవి ఆదేశాల మేరకు ఈసమావేశం నిర్వహించామన్నారు. ఈసందర్భంగా జట్పీటీసీ వాళ్ళ రంగారెడ్డి, రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ బొర్రా నరేష్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో ఇంకా ఆర్‌అండ్‌ఆర్ జాబితాలో అర్హులైన వారిపేర్లు రాలే దని వాటిని జాబితాలో చేర్చాలని మండలంలోని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్

జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



పారిశ్రామిక భవనానికి స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

జగ్గంపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ అన్నారు. స్థానిక రావులమ్మనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు ప్రతి నియోజకవర్గంలో సమస్యల పరిష్కారం కోసం చక్కని వేదిక ఏర్పాటు చేశారన్నారు. పలు సమస్యలపై వచ్చిన ప్రజల సమస్యలపై సంబంధించిన అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు, ఆళ్ళ రవికిషోర్, మండపాక అప్పన్న దొర, పడాల బాలాజీ, పోలిన సత్యనారాయణ పాల్గొన్నారు.

పారిశ్రామిక భవనానికి స్థల పరిశీలన

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన సంస్థ ఆధ్వర్యంలో స్థానిక గోకవరం రోడ్డులోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కాలేజి ఎదురుగా నూతన ఇండస్ట్రియల్ పారిశ్రామిక భవనానికి శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు శంకుస్థాపన జరగనుంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు హాజరవ్వనున్నారు. ఈ సందర్భంగా స్థల పరిశీలన చేసిన ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్రంలో నిరుద్యోగాన్ని రూపుమాపడానికి 175 నియోజకవర్గాల్లో ఇండస్ట్రియల పార్కులు చేస్తోందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, యూటీఎఫ్ నాయకులు తోలేటి సూర్యనారాయణ, గల్లా శ్రీను, మాతంశెట్టి సాయిబాబు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ సహకారంతో శనివారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జ్యోతుల ప్రారంభించనున్నారు.



ప్రదర్శన నిర్వహిస్తున్న బాలికలు

టి.రాయవరంలో కిశోర్ బాలికల ప్రదర్శన

ప్రత్తిపాడు, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఎన్.వరలక్ష్మి ఆధ్వర్యంలో మండలంలోని టి.రాయవరం గ్రామంలో శుక్రవారం కిశోర్‌బాలికల ప్రదర్శన నిర్వహించారు. కిశోర్‌బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని, బాల్యవివాహాలకు దూరం గా ఉండాలని సూపర్‌వైజర్ తెలిపారు. కిశోర్ బాలికల వివాహాలకు సహకరించిన వారికి వేధింపులు, అత్యాచారాలకు పాల్పడే వారిపై కఠిన శిక్షలు, పోక్సో చట్టం కింద కేసులు, జరిమానాలు విధిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం అనంతలక్ష్మి, అంగన్‌వాడీ సిబ్బంది పద్మ, వీరలక్ష్మి, ఆశావర్కర్ టి.అనసూయ, సచివాలయ సిబ్బంది కిశోర్ బాలికలు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధితో పేదలకు భరోసా

ఎమ్మెల్యే యనమల దివ్య



నిర్వాసితులకు పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దివ్య

తుని రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి పేద కుటుంబాలకు భరోసాగా నిలుస్తుందని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. ఇటీవల అనా రోగ్యానికి గురై శస్త్రచికిత్స చేయించుకున్న తాళ్లూరుకి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు ఆవుగడ్డి వెంకటరమణకు వెంకటరమణకు తేటగుంట టీడీపీ క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయ నిధి చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. అలాగే యాదాల దుర్గా, పప్పు వెంకటరమణ, నాగశివ, అశోక్‌కుమార్‌లకు మొత్తంగా రూ.4.90లక్షల చెక్కులను అందజేశారు. అలాగే క్యాంపు కార్యాలయంలో కుమ్మరిలోవ నిర్వాసితులకు పరిహార చెక్కులతో పాటు భూములు కోల్పోయిన వారికి మరో చోట భూములిచ్చిన పట్టాలను ఎమ్మెల్యే దివ్య అందజేశారు. 24 మందికి రూ.1.32కోట్లు నగదు చెక్కులతో పాటు 24మంది రైతులకు 27.11 ఎకరాల స్థలానికి సంబంధించిన పట్టాలను అందజేశారు. కార్యక్రమాల్లో యనమల రాజేష్, జక్కన రామనాయుడు, పోతల రాంబాబు, పరవాడ తాతబాబు, చింతమనీడి అబ్బాయి, పప్పు నవీన్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో విజయం సాధించాలి

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు



సమావేశంలో మాట్లాడుతున్న యనమల

తుని రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో నూరుశాతం విజయం సాధించే దిశగా కార్యకర్తలు పని చేయాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు అన్నారు. తేటగుంట టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే యనమల దివ్య అధ్యక్షతన సంస్థాగత ఎన్నికలపై విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ నియోజకవర్గం రాష్ట్రంలోనే ప్రత్యేకత సంతరించుకుంటుందని, అన్నివిధాలా అభివృద్ధి చేసే దిశగా ముందుకు సాగుతామన్నారు. 2029 నాటికి ఎన్నికల ముందు యనమల దివ్య ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తామన్నారు. మహానాడు నాటికి సంస్థాగత ఎన్నికలుపూర్తి చేసుకుని కార్యకర్తల సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు. పంచాయతీల విభజనకు సంబంధించి అవసరమైన వారు ఆయా గ్రామాల నుంచి కలెక్టర్‌కు ఈ నెల 13లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, యనమల రాజేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ నార్ల భువన సుందరి, చింతమనీడి అబ్బాయి, మాజీ ఎమ్మెల్యే నాగ జదీష్ పాల్గొన్నారు

'ఆదిత్య'లో ఉచిత నేత్ర వైద్య శిబిరం

గండేపల్లి, మే 9(ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య విశ్వవిద్యాలయంలో యూత్ క్రాస్ యూనిట్ ఆధ్వర్యంలో సిబ్బందికి ప్రత్యేక నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్టు డిప్యూటీ ప్రో ఛాన్సలర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సంకురాత్రి ఫౌండేషన్ కాకినాడ శ్రీ కిరణ్ నేత్ర శస్త్ర చికిత్సాలయం సహకారంతో సుమారు 300 మందికి ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించి అవసరమైన వారిని ఆపరేషన్ కోసం ఎంపిక చేశారు. యూత్ రెడ్‌క్రాస్ యూనిట్ కోఆర్డినేటర్ శివకుమార్, శ్రీ కిరణ్ కంటి ఆసుపత్రి సిబ్బంది. బి.ప్రవీణ, క్యాంపు కోఆర్డినేటర్ పెదిరెడ్ల సత్యనారాయణ, డి.నాగేశ్వరరావు, పి.ప్రసాదరావు పాల్గొన్నారు.

ముగిసిన అకడమిక్ లీడర్‌షిప్ ప్రోగ్రాం.. ఆదిత్య విశ్వవిద్యాలయంలో అధ్యాపకుల నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి చెన్నైకి చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ చెన్నై తో కలిసి నిర్వహించిన అకడమిక్ లీడర్‌షిప్, ఇన్‌స్టిట్యూషనల్ డెవలప్‌మెంట్ ఐదు రోజుల ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ముగిసింది. ఈ సందర్భంగా డిప్యూటీ ప్రోచాన్సలర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యా రంగంలో మార్పులు తీసుకురావడంలో విద్యా నాయకుల పాత్ర ఎంత ముఖ్యమో వివరించారు.

శ్రీ ప్రకాష్‌లో ముగిసిన సమ్మర్ క్యాంపు



సమ్మర్ క్యాంపులో పాల్గొన్న విద్యార్థులతో విజయప్రకాష్

తుని రూరల్, మే 9(ఆంధ్రజ్యోతి): శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల్లో 15 రోజులుగా నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపు ముగిసింది. విద్యార్థులకు యోగా, స్పోకెన్ ఇంగ్లీష్, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్, సంగీతం, పలు రకాల క్రీడల్లో నిష్ణాతులైన కోచ్‌లతో శిక్షణ ఇచ్చారు. ముగింపు సభలో విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి విజయ ప్రకాష్ మాట్లాడుతూ 25 ఏళ్ల నుంచి నిర్వహిస్తున్న ఈ క్యాంపులో విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో ముందుకెళ్లేందుకు ఆసక్తి కనబరుస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీనియర్ ప్రిన్సిపాల్ మూర్తి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య నుంచి విద్యుత్ లైన్ తొలగించాలి

జనసేన ఇన్‌చార్జి రమేష్‌కు కాండ్రేగుల వాసుల మొర

జగ్గంపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండలం కాండ్రేగుల వినాయకనగర్‌లో ఇళ్ల మధ్య నుంచి 11కేవీ కరెంటు లైన్ తొలగించే విధంగా కృషి చేయాలని జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్‌ను ప్రజలు కోరారు. శుక్రవారం వారు మాట్లాడుతూ మా కాలనీలో 11కేవీ కరెంట్‌లైన్ చాలా కింద నుంచి వేయడంతో చేతికి అందే విధంగా ఉండి ఇబ్బంది పడుతున్నామని, చాలా ప్రమాదాలు జరుగుతున్నాయని తెలియజేశారు. రమేష్ వెంటనే స్పందించి ఎలక్ట్రికల్ డీఈతో ఫోన్‌లో మాట్లాడి త్వరలో కరెంట్ లైన్‌ను ఇళ్ల మధ్య నుంచి కాకుండా వేరే ప్రదేశం నుంచి పంపే విధంగా కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను తీసుకెళ్లి త్వరగా పరిష్కారమయ్యే విధంగా కృషి చేస్తానన్నారు.

ఘనంగా నూకాంబిక విగ్రహ ప్రతిష్ఠ

మోతుగూడెం, మే 9 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెంలో శుక్రవారం కొండమీద నూకాంబిక ఆలయ నిర్మాణం జరిగింది. శుక్రవారం ఉదయం 6.45గంటలకు విగ్రహ ప్రతిష్ఠ గణేష్ బౌద్దర్ లక్ష్మి దంపతులు అమ్మవారి విగ్రహాన్ని, ఆలయాన్ని నిర్మించారు. వారిచే విగ్రహ ప్రతిష్ఠ చేయించారు. ప్రధాన అర్చకుడు పవన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి విశేష హోమం చేశారు. అనంతరం ఆలయ కమిటీవారు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రేపు సిరిగిందలపాడులో కంటి వైద్య శిబిరం

రంపచోడవరం, మే 9 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రామకృష్ణమిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం సిరిగిందలపాడులో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు రామకృష్ణమిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహరాజ్ తెలిపారు. శిబిరంలో ఉచితంగా కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు, కళ్ళజోళ్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. కంటి ఆపరేషన్ల కోసం వచ్చేవారు ఆధార్, తెల్లరేషన్ కార్డులు తప్పక తీసుకురావాలన్నారు.

రీ సర్వేను వేగంగా పూర్తి చేయండి: జేసీ



కె.నాయకంపల్లిలో రీసర్వే రికార్డులు పరిశీలిస్తున్న జేసీ రాహుల్ మీనా

గండేపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): మండల గ్రామాల్లో రీ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అధికారులకు ఆదేశించారు. ఆయన శుక్రవారం మండలంలో పి.నాయకంపల్లి, కె.నాయికంపల్లి గ్రామాల్లో జరుగుతున్న రీ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటివరకు రీ సర్వే ఎంతవరకు పూర్తయింది, పూర్తిస్థాయిలో ఎప్పటికీ పూర్తి చేయగలరని అధికారులను ప్రశ్నించారు. రీ సర్వే ద్వారా అవకతవకలున్నా సర్వే నెంబర్లు అన్నీ కూడా సరిచేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఆర్.శ్రీనివాస్, సర్వేయర్ ప్రసాద్, డివిజన్ సర్వేయర్ అంబికాలమ్మ, వీఆర్వో సాయిప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

రహదారిని నాణ్యంగా నిర్మించాలి: నవీన్



సింహాద్రిపురం రోడ్డు పనులను పరిశీలిస్తున్న జ్యోతుల నవీన్

కిర్లంపూడి, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో సింహాద్రిపురం ప్రధాన రహదారికి మోక్షం కలిగింది. ఉపాధి పథకం ద్వారా రూ.1.25 కోట్లతో ఈ రహదారి పనులు జరుగుతున్నాయి. శుక్రవారం రోడ్డు పనులను టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ పరిశీలించారు. పంచాయతీరాజ్ శాఖ డీఈ ఉమాశంకర్, ఏఈ నారాయణతో మట్లాడి నాణ్యతా ప్రమాణాలతో రోడ్డు నిర్మించాలని సూచించారు. ఆయన వెంట ఎంపీపీ తోట రవి, తోల గాంధీ, భూపాలపట్నం సర్పంచ్ వీరరెడ్డి కాశీ బాబు, చదరం చంటిబాబు, తూము కుమార్, నీలం శ్రీను, గాల్లపల్లి సూరిబాబు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ అందజేత

జగ్గంపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ 17 మందికి రూ.19,53,646 సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. ప్రతి ఒక్కరికీ ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అడపా భారత్‌కుమార్, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, రేఖబుల్లిరాజు, అల్లు విజయకుమార్, పోట్రూ కృష్ణ, శిలామంతుల వీరబాబు, జ్యోతుల సత్యమూర్తి, చిట్యాల బాబ్జి పాల్గొన్నారు.

ప్రతీ మహిళకు ప్రభుత్వం ఆసరా: సత్యప్రభ



కుట్టు మిషను శిక్షణ శిబిరంలో ఎమ్మెల్యే సత్యప్రభ

శంఖవరం, మే 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ మహిళకు ఆసరాగా నిలుస్తోందని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. శుక్రవారం శంఖవరంలో ఆమె బీసీ కా ర్పొరేషన్ ఆధ్వర్యంలో మహిళల కుట్టుమిషన్ల శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం వ్యవసాయశాఖ ద్వారా ప్రభుత్వం అందిస్తు న్న సబ్సిడీ ట్రాక్టర్లతో పాటు వ్యవసాయ పనిముట్లను రైతులకు అందించా రు. కార్యక్రమంలో పర్వత సురేష్, టీడీపీ మండలాధ్యక్షుడు బద్ది రామారావు, జనసేన నాయకుడు మేడిశెట్టి సూర్యకిరణ్, వెన్నా శివ, ఉల్లి వీరభద్రరావు, కీర్తి వెంకటసుభాష్, కరణం సుబ్రహ్మణ్యం, గాబు సుభాష్, మేకల కృష్ణ పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో ముద్రగడ పర్యటన

ప్రత్తిపాడు, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో శుక్రవారం వైసీపీ పొలిటికల్ అడ్వయిజరీ కమిటీ సభ్యులు ముద్రగడ పద్మనాభం, నియోజకవర్గం వైసీపీ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పర్యటించారు. పార్టీ బలోపేతానికి కృషి చేసి అధికారంలోకి వచ్చేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం చలంకూరి తాతాజీ ఇంట శుభకార్యంలో పాల్గొన్నారు.

పెరుమాళ్లపురంలో 'జవాన్లకు వందనం'

తొండంగి, మే 9 (ఆంధ్రజ్యోతి): పెరుమాళ్లపురం ఉన్నత పాఠశాలలో శుక్రవారం జవాన్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఈవో ఏ.సుబ్బిరెడ్డి భారత మాత చిత్రపటానికి పూలమాల వేశారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ యువత పుష్పాంజలి ఘటించారు. భారత దేశ సైనికులు సాధిస్తున్న విజయాలను కీర్తించారు. వారికి తమ అందరి మద్దతు ఉంటుందని ప్రకటించారు. దేశ రక్షణలో ప్రాణాలొడ్డుతున్న వీర జవాన్లకు వందనమంటూ సెల్యూట్ చేశారు. దేశ పతాకాలతో ర్యాలీ నిర్వహించారు. యుద్ధ సమయంలో అంతా ఐక్యంగా ఉండి అధికార్ల ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. అవసరమైన సమయంలో ప్రభుత్వ ఆదేశాలను పాటించి దేశానికి ఎటువంటి సహాయమైనా అందించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు.

గోవిందగిరి ఆలయంలో అందుబాటులో తిరుపతి లడ్డూ

రంపచోడవరం, మే 9 (ఆంధ్రజ్యోతి): ఐ.పోలవరం గోవిందగిరి శ్రీవెంకటేశ్వరస్వామి ఆయంలో తిరుమల తిరుపతి లడ్డూ ప్రసాదం అందుబాటులో ఉందని ఆలయ అధికారి నారాయణరాజు తెలిపారు. శనివారం ఉదయం 8 నుంచి లడ్డూ విక్రయిస్తామని ప్రసాదం కోసం భక్తులు కవర్లను తీసుకురావాల్సిందిగా సూచిం చారు. కార్యక్రమంలో ధర్మ ప్రచార భక్తమండలి కోఆర్డినేటర్ నల్లమిల్లి వేంకటరామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, దేవదాయ ధర్మదాయ శాఖ

టెండర్ కం బహిరంగ కౌలు వేలం పత్రికా ప్రకటన

[illegible]

వ.నెం	సర్వే నెం.	విస్తీర్ణం ఎ.ట్ల	వ.నెం	సర్వే నెం.	విస్తీర్ణం ఎ.ట్ల	వ.నెం	సర్వే నెం.	విస్తీర్ణం ఎ.ట్ల
1.	535	8-00	5.	553	196-90	9.	565	41-00
2.	545	20-20	6.	690	54-98	10.	538,565	7-00
3.	549	50-55	7.	623	6-80	11.	553,538	10-00
4.	538	78-94	8.	621	4-09			

మరిన్ని వివరములకు సెల్ నెంబరు 9121864089 నందు కాని, పిఠాపురం సత్రం ఆఫీసు పనివేళలలో కాని తెలుసుకొనవచ్చును.

పిఠాపురం
ది.9-5-2025

సున్న శ్రీరాములు
కార్యనిర్వహణాధికారి శ్రీ సంస్థానం సత్రం